క్లుప్తంగా

మార్మోగిన గోవిందనామస్మరణ



శ్రీవారి దర్శనానికి బారులు తీరిన భక్తులు

కొమ్మాది: రుషికొండలో గల శ్రీమహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. శనివారం శ్రీవారికి ప్రీతికరమైన రోజు కావడంతోపాటు పోలాల అమావాస్య, సెలవు దినం కావడంతో వేలాది మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. వేకువజామున సుప్రభాత, తోమాల సేవ అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. సాయంత్రం శ్రీవారి నామ సంకీర్తనలు, అన్నమయ్య గీతాలాపన, కోలాటాలు భక్తులను ఆకట్టుకున్నాయి.

పవిత్రోత్సవాల కరపత్రాలు ఆవిష్కరణ



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఆలయ ట్రస్టీలు

భీమునిపట్నం: కీతిన్‌పేట వద్దనున్న ఐశ్వర్య వేంకటేశ్వరస్వామి ఆలయంలో పవిత్రోత్సవాల నిర్వహణకు కరపత్రాలు శనివారం ఆవిష్కరించారు. ఈ నెల 31న శ్రీవారి పవిత్ర సమర్పణ, నవంబర్ 1న ఉదయం లక్ష తులసి పూజ, మధ్యాహ్నం అన్నకూటోత్సవం నిర్వహించనున్నారు. సాయంత్రం విశేష శాంతి కల్యాణం, పవిత్ర విసర్జన, మంగళాశాసనం, ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. కార్యాక్రమంలో ఆలయ ట్రస్టీలు కలిగొట్ల శ్రీరామచంద్రమూర్తి, కె.ఎస్.ఎన్.మూర్తి, కె.శ్రీనివాసరావు, కె.భానోజీరావు, కె.చంద్రశేఖరరావు, వి.తాతాజీ, మురళీమోహన్ పాల్గొన్నారు.

ఖాతాల నుంచి నగదు మాయం

తగరపువలస: జీవీఎంసీ రెండో వార్డు సంతపేటకు చెందిన జగన్నాథ లక్ష్మి, అప్పలకొండ అనే తల్లీకూతుళ్లకు చెందిన యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా బ్రాంచి ఖాతాల నుంచి రూ.25 వేల నగదు మాయమైంది. వేలిముద్రలు ఉపయోగించి ఈ నగదు కాజేసినట్టు బ్రాంచి సిబ్బంది బాధితులకు తెలిపారు. ఈ మేరకు బాధితులు భీమిలి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

దసరా సెలవుల నుంచి ఉచిత శిక్షణ తరగతులు

తగరపువలస: 2024 ఫిబ్రవరిలో జరిగే దక్షిణ భారత హిందీ ప్రచార సభ పరీక్షలకు ఈ దసరా సెలవుల నుంచి భీమిలిలో ఉచిత శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్టు భీమిలి ఆదర్శ ప్రేమీ మండలి అధ్యక్షుడు కె.ఎస్.ఆర్.కృష్ణారావు తెలిపారు. అలాగే రెండో శనివారం, ఆదివారం, ఇతర సెలవు రోజుల్లోనూ శిక్షణ కొనసాగుతుందన్నారు. పరిచయ్, ప్రాథమిక, మాధ్యమ, రాష్ట్ర భాష, ప్రవేశిక, రాష్ట్ర భాష విశారద పూర్వార్ధ, రాష్ట్ర భాష విశారద ఉత్తరార్ధ, రాష్ట్ర భాష ప్రవీణ పూర్వార్ధ, రాష్ట్ర భాష ప్రవీణ ఉత్తరార్ధ పరీక్షలకు హాజరయ్యేవారు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. మిగిలిన వివరాలకు 89856 47419, 89858 97419లో సంప్రదించాలని కోరారు.

బాలిక అదృశ్యం



మమత

పద్మనాభం: మండలంలోని కొవ్వాడ పంచాయతీ కొత్త కొవ్వాడలో ఓ బాలిక అదృశ్యమైనట్టు పోలీసులు శనివారం తెలిపారు. ఈ గ్రామానికి చెందిన పల్లా మమత (16) శుక్రవారం సాయంత్రం ఆరు గంటల సమయంలో షాపు వద్దకు వెళ్లి తిరిగి రాలేదు. ప్రస్తుతం అనంతవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతోంది. ఈమె అదృశ్యంపై తల్లి ఎర్నమ్మ పోలీసులకు ఫిర్యాదు చేయగా ఎస్ఐ రాము కేసు నమోదు చేశారు.

శరన్నవరాత్రి ఉత్సవాలకు సర్వం సిద్ధం

ఏర్పాట్లు చేసిన ఆలయ, మండపాల కమిటీలు



బైపాస్ రోడ్డులో ముస్తాబైన విజయదుర్గ ఆలయం

తగరపువలస: ఆదివారం నుంచి ప్రారంభం కానున్న శరన్నవరాత్రి ఉత్సవాలకు అమ్మవార్ల ఆలయాలు, మండపాలను ఆయా ఆలయ కమిటీల ప్రతినిధులు, ఉత్సవ కమిటీల ప్రతినిధులు సిద్ధం చేశారు. భీమిలి రోడ్డులోని ఆంధ్రా బ్యాంకు కూడలిలో శ్రీవిద్యా ఉపాసకులు సోమయాజుల కల్యాణ చక్రవర్తి శర్మ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మండపంలో పది అలంకరణలతో కూడిన అమ్మవారి విగ్రహాలు, విఘ్నేశ్వరుడు, కాలభైరవుడు, సరస్వతి, లక్ష్మీదేవి, సుబ్రహ్మణ్యస్వామి, కాళీమాత, మహాశివుడు తదితర 15 విగ్రహాలు ఏర్పాటు చేశారు. ఇక్కడ ఆదివారం విగ్రహాలతో శోభాయాత్ర నిర్వహించి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు, కుంకుమ పూజలు, తిరువీధి ఉత్సవాలు, దశవిధ హారతులు నిర్వహించనున్నారు. బైపాస్‌రోడ్డులోని శ్రీ విజయదుర్గ ఆలయంలో ట్రస్టీ రాజగిరి కుసుమహర ఆధ్వర్యంలో శరన్నవరాత్రి ఉత్సవాలకు ఆలయాన్ని ముస్తాబు చేశారు. సంగివలస పోలమాంబ దేవాలయంలో దేవదాయశాఖ ఆధ్వర్యంలో నిర్వహించే శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఉదయం, సాయంత్రం కుంకుమార్చన, 21 నుంచి 23 వరకు చండీ హోమం, పూర్ణాహుతి, ఈ నెల 31న అన్నదానం నిర్వహించనున్నారు. సంతపేట కొత్తమ్మవారి దేవాలయంలో శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా రోజూ అమ్మవారిని ప్రత్యేక అలంకరణతో భక్తులకు దర్శనాలు కల్పించనున్నారు. అంబేడ్కర్ కూడలిలో శ్రీదుర్గాభవాని ఆటో సంఘం, గ్రంథాలయ వీధి, చిట్టివలస జ్యూట్‌మిల్లు రామాలయం, జీరుపేట, రాములమ్మ థియేటర్, చిట్టివలస, రెడ్డి సంతపేట, సంగివలస, వలందపేట, భీమిలి మండలంలో మూలకుద్దు, మజ్జివలస, చిప్పాడ, తాటితూరు, తాళ్లవలస పంచాయతీల్లో అమ్మవారి శరన్నవరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు చేశారు.



ఉత్సవాలకు సిద్ధం చేసిన కాళీమాత విగ్రహం



తగరపువలస ఆంధ్రాబ్యాంకు కూడలి మండపంలో అమ్మవారి విగ్రహాలు

శ్రీఅష్టలక్ష్మి దేవాలయంలో...

కొమ్మాది: స్థానిక అన్నంరాజునగర్‌లో గల శ్రీ అష్టలక్ష్మి దేవాలయంలో ఆదివారం నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్తలు అన్నంరాజు సత్యనారాయణ, రమాదేవి దంపతులు తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం కలశస్థాపన, వరలక్ష్మి అభిషేకం, సోమవారం గజలక్ష్మి, మంగళవారం విజయలక్ష్మి, బుధవారం ధనలక్ష్మి, గురువారం సంతానలక్ష్మి, శుక్రవారం విద్యాలక్ష్మి, శనివారం ధాన్యలక్ష్మి, ఆదివారం ఆదిలక్ష్మి అమ్మవార్లకు అభిషేకాలు నిర్వహించనున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు చామర్తి శ్రీధర్ స్వామి తెలిపారు. అదేవిధంగా 24న విజయదశమి సందర్భంగా శ్రీ లక్ష్మీనారాయణ స్వామి వారికి వజ్ర కవచధారణ చేయనున్నట్లు తెలిపారు.

రాష్ట్రంలో జనరంజక పాలన



లింగన్నపేటలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

పద్మనాభం: ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సాగిస్తున్న జనరంజక పాలన ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తోందని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని బుడ్డివలస – అగ్రహారం పంచాయతీ లింగన్నపేట, బుడ్డివలస గ్రామాల్లో శనివారం రాత్రి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీలతో సంబంధం లేకుండా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తున్నట్టు తెలిపారు. 23 రకాల సంక్షేమ పథకాలను అర్హతే ప్రామాణికంగా లబ్ధిదారులకు అందజేస్తున్నామన్నారు. వైఎస్సార్ సీపీకి ఓటు వేయని వారికి కూడా ప్రభుత్వ పథకాలు అందజేయడం సీఎం జగన్ నీతి, నిజాయితీలకు నిదర్శనమన్నారు. గత ప్రభుత్వ పాలనలో సమస్యల పరిష్కారం కోసం ప్రజలు అధికారుల చుట్టూ తిరిగే వారన్నారు. అయినప్పటికీ సమస్యలు పరిష్కారమయ్యేవి కావన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలనలో గడప గడపకు మన ప్రభుత్వం ద్వారా అధికారులతో ప్రజల వద్దకు వచ్చి సమస్యలు తెలుసుకుని పరిష్కరిస్తున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. లబ్ధిదారులకు ప్రభుత్వ సంక్షేమ పథకాల మంజూరు పత్రాలను పంపిణీ చేశారు. లింగన్నపేటలో గ్రామ ప్రవేశంలో ఎమ్మెల్యేకు కోలాటంతో గ్రామస్తులు స్వాగతం పలికారు. బి.తాళ్లవలస ఈనాం భూముల సమస్య పరిష్కరించాలని బుడ్డివలస – అగ్రహారం సర్పంచ్ పిన్నింటి సూర్యనారాయణ కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కోరాడ లక్ష్మణరావు, బుడ్డివలస – అగ్రహారం సర్పంచ్ పిన్నింటి సూర్యనారాయణ, బి.తాళ్లవలస ఎంపీటీసీ సభ్యుడు చందక పైడినాయుడు, సర్పంచ్ చందక శ్రీను, ఎంపీడీవో ఎం.విజయ్ కుమార్, వైఎస్సార్ సీపీ నాయకులు మామిడి శివరామకృష్ణ, మరగడ అప్పారావు, సీర సూరప్పడు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో యువకుడికి తీవ్ర గాయాలు



విద్యుత్ షాక్‌తో శరీరం కాలిపోయిన కృష్ణ

పద్మనాభం: మండలంలోని అనంతవరంలో విద్యుత్ షాక్‌కు గురై ఒక యువకుడికి తీవ్ర గాయాలైనట్టు పద్మనాభం పోలీసులు చెప్పారు. పోలీసులు అందించిన వివరాలిలా ఉన్నాయి. అనంతవరం పంచాయతీ గొల్లలపాలెం గ్రామానికి చెందిన దువ్వు కృష్ణ (20) లైన్‌మెన్ రాధాకృష్ణ వద్ద హెల్పర్‌గా పని చేస్తున్నాడు. శనివారం అనంతవరంలోని కళిరెడ్డి పైడినాయుడు కోళ్లఫారం పక్కన ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఫ్యూజ్ కొట్టేసింది. ఈ క్రమంలో ఎల్‌సీ ఇవ్వకుండా... ఎల్‌సీ ఇచ్చానని ఫ్యూజ్ వేయమని కృష్ణకు లైన్‌మెన్ చెప్పాడు. ఫ్యూజ్ వేసేందుకు కృష్ణ ట్రాన్స్‌ఫార్మర్ ఎక్కగా షాక్‌కు గురై కింద పడిపోయాడు. దీంతో శరీరం కాలి తీవ్ర గాయాలయ్యాయి. కృష్ణను చికిత్స కోసం నగరంలోని కేజీహెచ్‌కు తరలించారు. దీనిపై కృష్ణ సోదరుడు రాజు ఫిర్యాదు చేసినట్టు పోలీసులు తెలిపారు.

విద్యార్థుల జీవితాల్లో జ్ఞానజ్యోతి వెలిగించాలి



శిక్షణ పూర్తి చేసుకున్న ఉపాధ్యాయులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న ఆర్‌జేడీ జ్యోతి కుమారి

ఆర్‌జేడీ జ్యోతికుమారి

అక్కిరెడ్డిపాలెం: విద్యార్థుల జీవితాల్లో జ్ఞానజ్యోతి వెలిగించాలని విద్యాశాఖ ఆర్‌జేడీ ఎం.జ్యోతి కుమారి కోరారు. చిన్నారుల సమగ్ర వికాసానికి సమష్టిగా కృషి చేయాలన్నారు. ఫౌండేషన్ లిటరసీ, న్యూమరసీలో భాగంగా మహిళా శిశు సంక్షేమ శాఖలో పని చేస్తున్న చైల్డ్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు ఆఫీసర్లు, సూపర్‌వైజర్లు, ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు 120 రోజుల పాటు నిర్వహించిన జ్ఞాన జ్యోతి రెసిడెన్షియల్ శిక్షణ కార్యక్రమం శనివారం ముగిసింది. ఈ సందర్భంగా షీలానగర్‌లోని మిలీనియం స్కిల్ డెవలప్‌మెంట్ ట్రైనింగ్ సెంటర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆర్జేడీ మాట్లాడారు. మూడు నుంచి ఎనిమిది సంవత్సరాల వయసు గల పిల్లలందరూ తప్పకుండా చదవడం, రాయడం తదితర చతుర్విధ ప్రక్రియలను చేయగలిగేలా చేయడం శిక్షణ ముఖ్య ఉద్దేశమని వివరించారు. శిక్షణలో పాల్గొన్న ప్రతీ ఒక్కరు మండల స్థాయిలో జరిగే శిక్షణ కార్యక్రమాల్లో అంగన్‌వాడీ టీచర్లకు, ఉపాధ్యాయులకు శిక్షణనిచ్చి, క్షేత్రస్థాయిలో అమలయ్యేలా చూడాలని కోరారు.

బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాలి

సమగ్ర శిక్ష అభియాన్ అదనపు ప్రాజెక్టు కో–ఆర్డినేటర్ బి.శ్రీనివాసరావు మాట్లాడుతూ చిన్నారుల ఆరోగ్యంపై, విద్యపై పూర్వ ప్రాథమిక దశ నుంచి ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని కోరారు. అంగన్‌వాడీ సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ కనబరిచి, విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాటలు వేయాలని ఆకాంక్షించారు. అనంతరం శిక్షణ పూర్తి చేసుకున్న అంగన్‌వాడీ సిబ్బంది, ఉపాధ్యాయులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఎస్ఎస్ఏ రాష్ట్ర పరిశీలకుడు పైడి వెంకటరావు, భీమిలి డైట్ ప్రిన్సిపాల్ ఎల్.సుధాకర్, అకాడమీ మానిటరింగ్ అధికారి డాక్టర్ జి.లక్ష్మి, కోనసీమ ఏఎంవో పి.రాంబాబు, కీ రిసోర్స్ పర్సన్లు ఆర్.ఎస్.ప్రసాద్, నిర్మలా కుమారి, హరిణి, తాతాజీ, రమాదేవి, సుచరిత, మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అధ్వానంగా వీధి దీపాల నిర్వహణ



పీఎం పాలెం షుగర్ కేన్ లే అవుట్‌లో మధ్యాహ్నం వేళ వెలుగుతున్న వీధిలైటు

పీఎం పాలెం : జీవీఎంసీ ఆరో వార్డు పరిధిలోని షుగర్ కేన్ లే అవుట్‌లో వీధి దీపాల నిర్వహణ అధ్వానంగా ఉందని స్థానికులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో నెలల తరబడి అంధకారం నెలకొన్నా వీధి దీపాల పునరుద్ధరణ చర్యలు చేపట్టడం లేదని వాపోతున్నారు. ఇటీవల పీఎం పాలెంలోని కాలనీల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించినప్పుడు ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావుకు స్థానికులు ఫిర్యాదు చేయగా అన్నిచోట్లా వీధి దీపాలు పునరుద్ధరించారని... అయనప్పటికీ నిత్యం వెలుగుతూనే ఉంటున్నాయని అంటున్నారు. షుగర్ కేన్ లే అవుట్‌లోని మొత్తం వీధి దీపాలు పగటి పూట ఆపేయకపోవడంతో త్వరగా పాడైపోయే ప్రమాదం ఉందని.. మరలా అంధకారం నెలకుంటే ఎవరు బాధ్యత వహిస్తారని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించిన వీధి దీపాల నిర్వహణకు చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

యూజీ, పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

దాబాగార్డెన్స్: విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో 2023–24 విద్యా సంవత్సరానికి వివిధ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.శోభారాణి పేర్కొన్నారు. అడ్మిషన్స్‌కు సంబంధించి ఆసక్తి గల విద్యార్థులు ఈ నెల 16 నుంచి 22 లోగా ఆన్‌లైన్‌లో వెబ్ ఆప్షన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. గ్రాడ్యుయేట్ లెవెల్‌లో బీఎస్సీ ఆనర్స్ మ్యాథమెటిక్స్, బీఎస్సీ ఆనర్స్ ఫిజిక్స్, బీఎస్సీ ఆనర్స్ కంప్యూటర్ సైన్స్, బీఎస్సీ ఆనర్స్ కెమిస్ట్రీ, బీఎస్సీ ఆనర్స్ బోటనీ, బీఎస్సీ ఆనర్స్ జువాలజీ, బీఎస్సీ ఆనర్స్ మైక్రోబయాలజీ, బీఏ ఆనర్స్ హిస్టరీ, బీఏ ఆనర్స్ ఎకనామిక్స్, బీఏ ఆనర్స్ పొలిటికల్ సైన్స్, బీ.కాం జనరల్, బీబీఏ లాజిస్టిక్స్, బీబీఏ హోటల్ మేనేజ్‌మెంట్, బీబీఏ హెల్త్‌కేర్, డిజిటల్ మార్కెటింగ్‌తో పాటు 12 పోస్ట్ గ్రాడ్యుయేషన్ కోర్సులు, ఎంఏ ఎకనామిక్స్, ఎంఏ తెలుగు, ఎంఏ ఇంగ్లిషు, ఎంఏ సోషల్ వర్క్, ఎం.కాం, ఎంఎస్సీ మ్యాథమెటిక్స్, మైక్రోబయాలజీ, బోటనీ, ఫిజిక్స్, ఆర్గానిక్ కెమిస్ట్రీ, కంప్యూటర్ సైన్స్ కోర్సులకు సంబంధించి ఆన్‌లైన్లో దరఖాస్తులు చేసుకోవాలని ఆమె పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 7032270810, 9052297729, 9396235303 నంబర్లలో సంప్రదించాలన్నారు.

ఆత్మనిర్భర్ భారత్ వైపు పురోగమించాలి

- డీఆర్‌డీవో డైరెక్టర్ జనరల్ శ్రీనివాసరావు
- ఎన్ఎస్‌టీఎల్‌లో ముగిసిన శిక్షణ తరగతులు

గోపాలపట్నం: పరిశ్రమ 4.0 కాన్సెప్ట్‌ను అనుసరించి ఆత్మనిర్భర్ భారత్ వైపు పురోగమించాలని విశిష్ట శాస్త్రవేత్త డీఆర్‌డీవో డైరెక్టర్ జనరల్(నేవల్ సిస్టమ్స్ అండ్ మెటీరియల్స్) వై.శ్రీనివాసరావు అన్నారు. ఎన్ఎస్‌టీఎల్‌లో పరిశ్రమ 4.0 కాన్సెప్ట్ అప్లికేషన్స్‌పై ఐదు రోజులుగా జరుగుతున్న శిక్షణ తరగతులు శనివారం ముగిశాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డీఆర్‌డీవో, దేశాభివృద్ధి కోసం ఉద్యోగులంతా ఆధునిక నైపుణ్యాలు మెరుగుపరుచుకోవాలన్నారు. ఎన్ఎస్‌టీఎల్ డైరెక్టర్ డాక్టర్ అబ్రహం వర్గీస్ మాట్లాడుతూ క్రమ పద్ధతిలో ప్రాజెక్టు పూర్తికి పరిశ్రమ 4.0 దోహదపడుతుందన్నారు. అత్యంత ప్రయోజనకరమైన ఈ కోర్సులో స్మార్ట్ మాన్యుఫ్యాక్చరింగ్, ఆడిటివ్ మాన్యుఫ్యాక్చరింగ్, రోబోటిక్స్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, అగ్‌మెంటెడ్ రియాలిటీ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్త, ఎఫ్ కోర్సు డైరెక్టర్ ఎస్.మధుకిరణ్, శాస్త్రవేత్త, జీ టెక్నాలజీ డైరెక్టర్ కేదార్‌నాథ్, ఐఐటీ, పలు వర్సిటీలు, పరిశ్రమల ప్రతినిధులు పాల్గొన్నారు.

భక్తులకు ట్రాఫిక్ చిక్కులు

సంగివలస పోలమాంబ ఆలయ సమీపంలో అవస్థలు



పోలమాంబ ఆలయం ముందు నిలిపిన బస్సు



ఆలయం వద్ద రెయిలింగ్ దూకుతున్న భక్తుడు



ఆలయ ఆవరణలో కార్ల పార్కింగ్‌కు సిద్ధం చేస్తున్న స్థలం

తగరపువలస: ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్య దైవంగా పూజలు అందుకుంటున్న సంగివలస పోలమాంబ ఆలయం అలియాస్ ముగ్గురు అమ్మవార్ల ఆలయం వద్ద ట్రాఫిక్ పెద్ద చిక్కు సమస్యగా మారింది. ఇక్కడి పరిస్థితితో భక్తులు, ఆలయ, ట్రాఫిక్, రవాణా సిబ్బంది నిత్యం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. విశాఖ నుంచి తగరపువలస మీదుగా విజయనగరం, శ్రీకాకుళం వెళ్లే సిటీ, ప్యాసింజర్ బస్సులను ప్రయాణికుల సౌకర్యార్థం సర్వీస్ రోడ్డులో అమ్మవారి ఆలయం ముందే నిలుపుతున్నారు. దీనివల్ల ఆలయానికి వచ్చే భక్తులకు అసౌకర్యంగా ఉంటుంది. ముఖ్యంగా శరన్నవరాత్రి ఉత్సవాలు, కార్తీకమాసం, వార్షిక ఉత్సవాల సమయంలో అమ్మవారి ఆలయం భక్తులతో కిక్కిరిసిపోతుంది. అంతేకాకుండా ఆలయం ముందు సర్వీస్ రోడ్డుపై నిర్వహించే పరస కారణంగా ద్విచక్ర వాహనాలు కూడా ఈ సర్వీస్‌రోడ్డుపై రాకపోకలు సాగించలేవు. ఈ కారణంగా విశాఖ నుంచి వచ్చే వాహనాలకు అమ్మవారి ఆలయం దాటిన తర్వాత హైవే నుంచి సర్వీస్‌రోడ్డు మీదకు నేరుగా అనుమతించేలా హైవే అధికారులు మార్పులు చేయాలని కోరుతున్నారు. అలాగే హైవే మీదుగా వాహనాలపై రాకపోకలు సాగించే భక్తులకు రెయిలింగ్ అడ్డంగా ఉండటంతో అక్కడి నుంచే దండం పెట్టుకుని నేరుగా వెళ్లిపోతున్నారు. ఆలయంలో అమ్మవారిని దర్శించుకోవాలని ఉన్నా రెయిలింగ్ దాటలేక వెనుతిరుగుతున్నారు. ఈ కారణంగా భక్తులు ఆలయంలోకి రాకపోకలు సాగించే విధంగా రెయిలింగ్ ఓపెన్ చేసి ఆలయానికి ఇరువైపులా స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

తాత్కాలికంగా ప్రత్యామ్నాయ చర్యలు

భక్తుల సౌకర్యార్థం దేవదాయశాఖ ఆలయం వద్ద ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టింది. ఆలయానికి ఇరువైపులా దుకాణాలను ఫుట్‌పాత్ నుంచి వెనుకకు జరిపించి కొంత వెసులుబాటు కల్పించింది. సర్వీస్‌రోడ్డు ద్వారా కార్లు, ఇతర వాహనాలపై ఆలయానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం ఖాళీగా ఉన్న ఆలయ పరిసరాల్లో వాహనాల పార్కింగ్ కోసం స్థలాన్ని జేసీబీతో చదును చేయించారు. దీంతో సర్వీస్ రోడ్డుపై వాహనాలు నిలపకుండా నేరుగా పార్కులోకి అనుమతించి తిరుగు ప్రయాణంలో సంగివలస కాలనీవైపు గేటు ద్వారా బయటకు పంపించనున్నారు. ఈ పనులు తాత్కాలికంగా ఉపశమనం కలిగించినా ఆలయం ముందు నుంచి బస్సులు, ఇతర వాహనాలు రాకపోకల సమయంలో అక్కడే ఆపకుండా ఇంకా ముందు ప్రదేశంలో నిలిపేలా హైవే అధికారులు చర్యలు చేపట్టాల్సి ఉంది. ఇందుకోసం హైవే నుంచి ఆలయం తర్వాత సర్వీస్ రోడ్డులోకి ప్రవేశం కల్పిస్తే భక్తులకు, ప్రయాణికులకు మేలు జరుగుతుందని పలువురు అంటున్నారు.

నేడు కూచిపూడి నృత్య ప్రదర్శన

పీఎం పాలెం: వారాంతపు వినోద కార్యక్రమాల్లో భాగంగా శిల్పారామం (జాతర)లో ఆదివారం సాయంత్రం 6 గంటలకు కూచిపూడి నృత్య ప్రదర్శన వుంటుందని స్థానిక పరిపాలన అధికారి విశ్వనాథరెడ్డి తెలిపారు. నగరంలోని నృత్య భారతి గాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో ప్రదర్శన ఉంటుందని తెలిపారు.

మృతుడు జగదాంబ ప్రాంతవాసి

తగరపువలస: బంగ్లామెట్ట పాత వంతెన వద్ద గోస్తనీనదిలో శుక్రవారం లభ్యమైన మృతదేహం నగరంలోని జగదాంబ సమీపంలోని జిల్లా కోర్టు ఏరియాకు చెందిన దువ్వి పైడిరాజుదిగా భీమిలి పోలీసులు గుర్తించారు. ఈ మేరకు మృతుని భార్య సమత ఫిర్యాదు చేసింది. నగరంలో ద్విచక్ర వాహనాల రికవరీ ఏజెంట్‌గా పనిచేస్తున్న పైడిరాజు అప్పుల బాధతోపాటు మద్యానికి బానిసై ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని ఆమె ఫిర్యాదులో పేర్కొంది. భీమిలి పోలీసులు కేసు నమోదు చేశారు.

మర్యాదపూర్వక కలయిక



కోలా గురువులను సత్కరిస్తున్న దిల్బాగ్ సింగ్ ఆనంద్

కొమ్మాది: ఇటీవల రాష్ట్ర సిక్కు సంక్షేమ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన డాక్టర్ దిల్బాగ్ సింగ్ ఆనంద్ శనివారం ఎండాడలో గల వైఎస్సార్ సీపీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు కోలా గురువులను మర్యాద పూర్వకంగా కలిసి సత్కరించారు. ఆయన వెంట సాంస్కృతిక విభాగం జోనల్ ఇన్‌చార్జి వంకాయల మారుతీ ప్రసాద్ తదితరులు ఉన్నారు.

పబ్లిక్ డిమాండ్

రహదారి మధ్యలో గుంతలతో ప్రమాదం



పిలకవానిపాలెం రహదారిపై ఏర్పడిన గొయ్యి



మ్యాన్‌హోల్ మూత లేకపోవడంతో రాళ్లు వేసిన దృశ్యం

తగరపువలస: జీవీఎంసీ 7వ వార్డు పిలకవానిపాలెం ఎడమవైపు రహదారిపై పలుచోట్ల గుంతలు కారణంగా తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. కార్‌షెడ్ కూడలి నుంచి విజయం టెక్నో స్కూల్‌కు వెళ్లే ఈ రహదారిలో పలు డిపార్ట్‌మెంట్ స్టోర్లు ఉన్నాయి. ఈ రహదారిపై గోతులు, కొన్నిచోట్ల మ్యాన్ హోల్స్‌పై మూతలు లేకపోవడంతో వాహనదారులు వీటిలో పడి ప్రమాదాలకు గురవుతున్నారు. జీవీఎంసీ ఇంజినీరింగ్ విభాగం అధికారులు స్పందించి ఈ రహదారిపై గుంతలు ఉన్నచోట మరమ్మతులు చేపట్టి ప్రమాదాలు నివారించాలి.

– ఎం.నారాయణరావు, 7వ వార్డు, పిలకవానిపాలెం

విద్యుత్ చార్జీలు తగ్గించాలని ఆందోళన

తగరపువలస: విద్యుత్ చార్జీల భారం తగ్గించాలని కోరుతూ సీపీఐ నాయకులు శనివారం కరపత్రాలు పంపిణీ చేశారు. అనంతరం స్థానిక అంబేడ్కర్ కూడలిలో నిరశన తెలిపారు. ఆ పార్టీ జిల్లా కార్యదర్శి మరుపిళ్ల పైడిరాజు, మాజీ కౌన్సిలర్ తూతిక సోమరాజు, చిల్ల నరసింహులు, కానూరి రాంబాబు, మొర అప్పలరాజు, నూలు ఆదినారాయణ, మావూరి వీర్రాజు, ఎం.రాము, ఎం.సన్నిబాబు, ఎ.సూర్యనారాయణ పాల్గొన్నారు.

ఘనంగా హిందీ పక్షోత్సవాలు



పురస్కారం అందిస్తున్న రియర్ అడ్మిరల్ మనీష్ శర్మ

సింథియా: తూర్పు నావికాదళ సాముద్రిక ఆడిటోరియంలో శనివారం హిందీ పక్షోత్సవాలను ఘనంగా నిర్వహించారు. నావికా హెడ్ క్వార్టర్స్ చీఫ్ స్టాఫ్ ఆఫీసర్(ఆపరేషన్స్) రియర్ అడ్మిరల్ మనీష్‌శర్మ ముఖ్యఅతిథిగా పాల్గొని వార్షిక హిందీ మ్యాగజైన్ పూర్వివాణి 29వ ఎడిషన్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందీ భాష, సంస్కృతిని ప్రోత్సహించడంలో పూర్వివాణి కీలక పాత్ర పోషిస్తుందన్నారు. అనంతరం వివిధ యూనిట్లకు రాజభాషా పురస్కారాలు అందజేశారు.